వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 002
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
డిసెంబర్ 02, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



8లో..

## రైతులకు కేంద్రం మరింత మద్దతు అందించాలి

- ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- లోక్ సభలో సమాధానం చెప్పిన మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

# బాబోయ్.. వీధి కుక్కలు




హనుమకొండ నగరంలో వీధి కుక్కల బెడద పతాక స్థాయికి చేరింది. ఇటీవల కాలంలో నగరంలోని ప్రధాన ప్రాంతాలైన న్యూశాయంపేట, నయీంనగర్, లష్కర్ బజార్, హనుమకొండ చౌరస్తా, రెడ్డి కాలనీలలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అత్యంత దారుణంగా, చిన్నారులపై దాడులకు తెగబడుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. వీధి కుక్కల దాడులకు ఇటీవల న్యూశాయంపేటలో జరిగిన సంఘటనే నిదర్శనం. వీధి కుక్కల గుంపు దాడి చేయడంతో ఒక చిన్నారి తీవ్రంగా గాయపడటం స్థానికులను ఉలిక్కిపడేలా చేసింది. లష్కర్ బజార్‌తో సహా పలు ప్రాంతాలలో ఇలాంటి ఘటనలు తరచుగా చోటుచేసుకుంటుండటంతో, బయటకు వెళ్లాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. - వరంగల్ వాయిస్, ప్రతినిధి

వివరాలు 2లో..



8లో..

## రక్తదానం చేయండి.. పలువురి ప్రాణాలు కాపాడండి

- వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ



2లో..

## జెండా మోసిన వారికే ప్రాధాన్యం

- మరో పదేళ్లు అధికారంలో ఉండేలా కార్యాచరణ
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశానికి హాజరు




## బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

- 42 శాతం ప్రకటించి 17 శాతానికే పరిమితం
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంటూ ప్రకటించి తీరా 17 శాతానికే పరిమితం చేసి బీసీలను మోసం చేసిందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆరోపించారు. సర్పంచ్ ఎన్నికలలో భాగంగా మంగళవారం హసన్ పర్తి మండల పరిధిలోని జయగిరి, మడిపల్లి, ఐనవోలు మండలలోని పంతిని, నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామాల సర్పంచ్, వార్డు సభ్యులుగా పలువురు నామినేషన్లు దాఖలు చేశారు. (మిగితా 8వ పేజీలో..)



2లో..

## ఎన్నికలకు సర్వం సిద్ధం

- కలెక్టర్ స్నేహ శబరీష్
- హెల్ప్ డెస్క్ ల్లో క్షేత్రస్థాయి పరిశీలన



# బాబోయ్ వీధి కుక్కలు

- కాలనీల్లో గుంపులు గుంపులుగా
- వణికిపోతున్న జనం
- అధికారులు స్పందించాలని విజ్ఞప్తి

**వరంగల్ వాయిస్, ప్రతినిధి :** మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం , వీధి కుక్కల సంఖ్య గణనీయంగా పెరగడానికి, వాటిని నియంత్రించడంలో మున్సిపల్ అధికారుల అలసత్వం ప్రధాన కారణమని స్థానికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. కుక్కల సంఖ్యను నియంత్రించడానికి చేపట్టాల్సిన జంతు జనన నియంత్రణ కార్యక్రమాన్ని అధికారులు సరిగా అమలు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కార్పొరేటర్ హెచ్చరికలు బేఖాతరు..**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని కుమార్ పల్లి మార్కెట్ ప్రాంతంలోనూ పరిస్థితి భయంకరంగా ఉంది. మార్కెట్‌కు వచ్చే ప్రజలు, ముఖ్యంగా పిల్లలు కుక్కల గుంపులను చూసి జంకుతున్నారు. కుక్కలు వెంబడించడం, అరుస్తూ భయపెట్టడం వంటివి నిత్యకృత్యమయ్యాయి. ఈ సమస్యపై 8వ డివిజన్ కార్పొరేటర్ బైరి లక్ష్మి కుమారి ఇప్పటికే పలుమార్లు మున్సిపల్ అధికారులను హెచ్చరించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల ఆమెతో పాటు స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రమాదకరంగా మారిన ఈ సమస్యపై జీడబ్ల్యూఎంసీ మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కుమార్ పల్లి మార్కెట్ సహా, సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో వీధి కుక్కలను తక్షణమే పట్టి, జంతు జనన నియంత్రణకార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలి. కార్పొరేటర్ హెచ్చరికలను కూడా లెక్కచేయని, నిర్లక్ష్యం వహించిన సంబంధిత శానిటరీ/పారిశుధ్య అధికారులపై తగు చర్యలు తీసుకోవాలి. తల్లిదండ్రులు వీధి కుక్కలు ఉన్న ప్రాంతాలలో పిల్లలను ఒంటరిగా బయటికి పంపకుండా అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న ఈ వీధి కుక్కల సమస్యపై ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించి, శాశ్వత పరిష్కారం చూపుతారని స్థానికులు ఆశిస్తున్నారు.



# బీసీలు సత్తా చాటాలి..

## చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణలో జాజుల శ్రీనివాస్ గౌడ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీసీ రిజర్వేషన్ల పేరుతో నాటకాలాడుతున్న కాంగ్రెస్, బీజేపీలపై బీసీ జేఏసీ యుద్ధభేరి మోగించింది. ఈ క్రమంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను సాధించుకునేందుకు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో డిసెంబర్ 9న చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ నేతృత్వంలో మంగళవారం హనుమకొండలో చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ హాజరై చలో ఢిల్లీ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటుందని ఆ రెండు పార్టీలపై ఆయన యుద్ధం ప్రకటించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ బీజేపీ పార్టీల బీసీ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, బీసీ సమాజం ముందు రెండు పార్టీలను దోషులుగా నిలబెడతామన్నారు. బీసీ రిజర్వేషన్లు వచ్చుడో, కాంగ్రెస్ బీజేపీ, పార్టీలను భూస్థాపితం చేసుడో అనే విధంగా ఉద్యమ కార్యాచరణను రూపొందించినట్లు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఇప్పటికైనా జనాభా దామాషా ప్రకారం బీసీలకు చట్టసభలతో పాటు, స్థానిక సంస్థల కోటాలో, విద్యా, ఉద్యోగ రంగాల్లో ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లను కల్పించాలని ఆయన కాంగ్రెస్, బీజేపీ పార్టీలను డిమాండ్ చేశారు. చలో ఢిల్లీ కార్యక్రమంతో బీసీ సమాజమంతా తమ గర్జనను వినిపించేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి జేఏసీ రాష్ట్ర, జిల్లా నాయకులు డాక్టర్ చిర్ర రాజు గౌడ్, డాక్టర్ సంగాని మల్లేశ్వర్, బోనగాని యాదగిరి గౌడ్, దొడ్డపల్లి రఘుపతి, తమ్మేలా శోభరాణి, మాదం పద్మజ దేవి, తెల్ల సుగుణ, పల్లెపు సమ్మయ్య, అమరావది సారంగపాణి, చిర్ర సుమన్ గౌడ్, కరుణ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు సర్వం సిద్ధం

- కలెక్టర్ స్నేహ శబరీష్
- హెల్ప్ డెస్క్ ల్లో క్షేత్రస్థాయి పరిశీలన

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎన్నికలకు పకడ్బందీగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రకటించారు. ధర్మసాగర్ క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను కలెక్టర్ పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ధర్మసాగర్, రాపాకపల్లి గ్రామాలకు సంబంధించి సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లను స్వీకరిస్తున్న కౌంటర్లను కలెక్టర్ పరిశీలించి ఇప్పటివరకు ఎన్ని నామినేషన్లు వచ్చాయని ఆరా తీశారు. సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్ని నామినేషన్లు వచ్చాయని రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎలక్షన్ నోటీస్, ఎలక్టోరల్, రిజర్వేషన్ల జాబితాను గ్రామపంచాయతీ కార్యాలయంలో పెట్టారా అని ఎంపీడీవో అనిల్ కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద అతికించిన ఎలక్షన్ నోటీసు, ఎలక్టోరల్ రోల్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవో అనిల్ కుమార్ లతో కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు స్థానాలకు వచ్చిన నామినేషన్లకు విడివిడిగా ఫైళ్లను పెట్టాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పెట్టిన ఎలక్షన్ నోటీస్, ఎలక్టోరల్ జాబితాను పెట్టారా లేదా అని ఎంపీడీవో పర్యవేక్షించాలన్నారు. హెల్ప్ డెస్కుల ద్వారా నామినేషన్ వేసే అభ్యర్థులకు కావాల్సిన సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, స్థానిక తహసిల్దార్ సదానందం, ఎంపీవో సయ్యద్ అఫ్జల్, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

# జెండా మోసిన వారికే ప్రాధాన్యం

- మరో పదేళ్లు అధికారంలో ఉండేలా కార్యాచరణ
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశానికి హాజరు



**వరంగల్ వాయిస్, గాంధీ భవన్ :** కాంగ్రెస్ పార్టీలో జెండా మోసిన వారికే అధిక ప్రాధాన్యం ఉంటుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హైదరాబాదులోని గాంధీ భవన్ లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఇంచార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగిన టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో పశ్చిమ ఎమ్మెల్యే, హనుమకొండ జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొని నూతన అధ్యక్షులకు పలు సూచనలు చేశారు. జెండా మోసిన స్థాయి నుంచి ఎందరో అతిరథ మహారథులు చేపట్టిన డీసీసీ పదవిని 11 ఏళ్లు నిర్విరామంగా పని చేయడం నా అదృష్టంగా భావిస్తున్నానని నాయిన ప్రకటించారు. డీసీసీ అధ్యక్ష పీఠం తల్లిలాంటిదని పార్టీలో మనమంటే నచ్చని వారు సైతం ఉంటారని వారిని కూడా తల్లిలాగా కలుపుకోవాలని, తారతమ్య బేధాలు లేకుండా చూడాలని వెల్లడించారు. డీసీసీ పదవి చేపట్టిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని 100 శాతం పార్టీకి, కింది స్థాయి కార్యకర్తలకు వీలైనంత న్యాయం జరిగేలా చూడాలని కోరారు. డీసీసీ అధ్యక్షులుగా నియమితులైన సభ్యులందరూ పార్టీ కార్యక్రమాల నిర్వహణలో చురుకుగా ఉండాలని కార్యక్రమలకు సమాచార లోపం లేకుండా చూడాలన్నారు. పార్టీలోకి నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలను ఏబీసీలుగా విభజించి ప్రతి కార్యక్రమానికి ఆహ్వానం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కమిటీ, అనుబంధ సంఘాల నేతలతో నెలలకు ఒకసారి సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ అధికంగా ఉంటుందని, గ్రూపు రాజకీయాలకు తావులేకుండా నూతన అధ్యక్షులు చూడాలన్నారు. పై స్థాయి నేతల మధ్య సమన్వయ లోపంతో కింది స్థాయి కార్యకర్తలు నారాజు కాకుండా చూసుకోవాల్సిన అనితర బాధ్యత డీసీసీ అధ్యక్షులపై ఉంటుందని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన డీసీసీ అధ్యక్షులు సోషల్ మీడియా వారియర్స్ ని కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. అధికారంలో ఉన్నాం కాబట్టి ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని వాటన్నింటిని కింది స్థాయి వరకు తీసుకెళ్లడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. లక్షల్లో ఒకరికి వచ్చే గొప్ప అవకాశం డీసీసీ పదవి అని రానున్న ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా, మరో పదేళ్లు అధికారంలో ఉండేలా కృషి చేయాలని నూతన అధ్యక్షులకు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ధనసరి అనసూర్య(సీతక్క), వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, సచిన్ సవంత్ లు హాజరైన ఈ సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, నమిండ్ల శ్రీనివాస్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇవి శ్రీనివాస్ రావు, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీను బాబు, నూతన డీసీసీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ దత్త జయంతి వేడుకలు

◆ ముస్తాబైన శ్రీ వరద దత్త క్షేత్రం

◆ 4న త్రిమూర్తి స్వరూపుని పుట్టు పండుగ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** సృష్టికర్త బ్రహ్మ, లోకపాలకుడు విష్ణువు, లయకారుడు మహేశ్వరుడు... ముగ్గురు దేవతల స్వరూపంగా, గురువులకు గురువుగా, స్మరణ చేస్తే పలికే దైవంగా కొలవబడే శ్రీ దత్తాత్రేయ స్వామివారి జయంతి (పుట్టు పండుగ) వేడుకలు ఈ నెల 4న వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మార్గశిర మాసం పౌర్ణమి పర్వదినాన శ్రీ దత్తాత్రేయ జయంతి సందర్భంగా... ములుగు రోడ్డులోని శ్రీ గణపతి సచ్చిదానంద వరద దత్త క్షేత్రంలో ఈ ఉత్సవాలను ఘనంగా జరపనున్నారు. అవధూత దత్త పీఠాధిపతి జగద్గురు శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ, దత్త పీఠం ఉత్తరాధికారి శ్రీ శ్రీ శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీల ఆశీస్సులతో ఈ కార్యక్రమాలు జరుగుతాయని శ్రీ గణపతి సచ్చిదానంద దత్త జ్ఞాన బోధ సభ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వైవి వామన్ రావు తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తుల సమక్షంలో శ్రీ దత్తాత్రేయ స్వామి ఉత్సవ మూర్తికి అభిషేకం జరుగుతుంది. ఉదయం 11 గంటలకు పౌర్ణమి సందర్భంగా దత్త హోమం, పూర్ణాహుతి నిర్వహించబడుతుంది. ఆశ్రమంలోని మూల విరాట్ అయిన శ్రీ వరద దత్తాత్రేయ స్వామివారికి నువ్వుల నూనె (తైలం), సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలు, చందనం, విభూది, గంధంలతో ప్రత్యేక అభిషేకం, సహస్ర నామ అర్చన, అలంకరణ, నైవేద్య నివేదన మరియు మహా మంగళహారతులు సమర్పించడం జరుగుతుంది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం, మహా అన్నదానం వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. త్రిమూర్తి స్వరూపం అయిన శ్రీ దత్తాత్రేయ స్వామి అత్రి మహర్షి, అనసూయ మాతల పుత్రుడుగా, సకల దేవతలకు, గురువులకు గురు స్వరూపంగా పూజలందుకుంటారు. భక్తులు తమ ఆరోగ్యం మెరుగుపడటానికి, నవగ్రహ బాధలు, ఇతర కష్టాల నివారణకు నువ్వుల నూనె (తైలం)తో అభిషేకం చేస్తే స్వామివారి విశేష అనుగ్రహం లభిస్తుందని ట్రస్ట్ సభ్యులు వైవి వామన్ రావు తెలియజేశారు. భక్తులందరూ ఈ పర్వదినాన క్షేత్రానికి విచ్చేసి దత్తాత్రేయ స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## నాణ్యత లేని డ్రైనేజీ కాలువల నిర్మాణం



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణంలో నూతనంగా చేపడుతున్న సైడ్ డ్రైనేజీ కాలువల నిర్మాణంలో నాణ్యత లోపం తీవ్రంగా ఉందని, కాంట్రాక్టు పనులపై మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని బీజేపీ ఆరోపించింది. మంగళవారం బీజేపీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పరకాల మున్సిపల్ కమిషనర్ కు ఈ విషయమై ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువల కాంట్రాక్టు పనుల్లో నాణ్యత లేకపోవడంపై బీజేపీ నాయకులు తమ నిరసన వ్యక్తం చేశారు. కాలువ నిర్మాణంలో నాణ్యత లోపానికి నిదర్శనంగా... కొన్ని చోట్ల కరెంటు స్తంభాలను తొలగించకుండానే అడ్డంగా స్తంభాన్ని మధ్యలో ఉంచి కాలువ నిర్మాణం చేపట్టారని వారు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇది కాంట్రాక్టర్ పనితీరుకు, నాణ్యతా ప్రమాణాలకు ఏ మాత్రం నిదర్శనం కాదని విమర్శించారు. పరకాల మున్సిపల్ అధికారులు ఈ నిర్మాణ పనులను కనీసం పర్యవేక్షించకపోవడం వల్లే కాంట్రాక్టర్లు ఇష్టానుసారం పనులు చేస్తున్నారని, ఇది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. అందువల్ల, సంబంధిత అధికారులు వెంటనే డ్రైనేజీ కాలువల నిర్మాణాన్ని పర్యవేక్షించాలని, పరకాల పట్టణ ప్రజలకు నాణ్యమైన కాలువ నిర్మాణం జరిగేలా కృషి చేయాలని వారు కమిషనర్‌ను కోరారు. ఈ వినతి పత్రం సమర్పించిన కార్యక్రమంలో బీజేపీ పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం, జిల్లా నాయకులు కుక్కల విజయ కుమార్, ఉపాధ్యక్షులు మిడిదొడ్డి నరేష్, కార్యదర్శి దార్న సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## కేయూలో దివ్యాంగులకు క్రీడా పోటీలు



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకుని, కాకతీయ విశ్వవిద్యాలయంలోని వికలాంగుల సెల్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయానికి చెందిన దివ్యాంగుల కోసం క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో దివ్యాంగ విద్యార్థులు, అలాగే దివ్యాంగ ఉద్యోగులు (నాన్–టీచింగ్ సిబ్బంది) ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొ.కట్ల రాజేందర్ (కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్), ప్రొ.వై.వెంకయ్య (డైరెక్టర్, స్పోర్ట్స్ బోర్డ్), ప్రొ.ఈసం నారాయణ (ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్), డా.ఏ.రాజు (కేయూ వికలాంగుల సెల్ డైరెక్టర్)కలిసి క్రీడాపోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులలో ఆత్మవిశ్వాసాన్ని, స్ఫూర్తిని పెంచడానికి ఇలాంటి క్రీడాపోటీలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు దివ్యాంగ విద్యార్థులు, ఉద్యోగుల ఆటల తీరు అందరినీ ఆకట్టుకుంది.

# ట్రిబ్యునల్ కోర్టు వృద్ధులకు ఒక వరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా పరిషత్ ఆవరణలో ఉన్న సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌ను ఈరోజు పరకాల ఆర్డీఓ డాక్టర్ నారాయణ, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు డే కేర్ సెంటర్‌లో వయోవృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ క్లినిక్, లీగల్ ఎయిడ్ (న్యాయ సలహాల) క్లినిక్ పనితీరును పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే, సలహాలు, సూచనలు, కౌన్సిలింగ్ కోసం ఎంతమంది వచ్చారు, ఎన్ని కేసులు నమోదయ్యాయి అనే అంశాలను కూడా ఆరా తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణ, డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ... సీనియర్ సిటిజన్స్‌కు ఈ డే కేర్ సెంటర్ చక్కని ఆటవిడుపు కేంద్రంగా ఉపయోగపడుతుందని అన్నారు. సెంటర్‌లోని లైబ్రరీ, ఆట వస్తువులను వినియోగించుకోవడం ద్వారా వృద్ధులలో ఒంటరితనం దూరం అవుతుందని వారు సూచించారు. అలాగే, సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌లో అందిస్తున్న ఉచిత ఫిజియోథెరపీ సేవలను, ఉచిత న్యాయ సలహాల కేంద్రాన్ని తప్పనిసరిగా వాడుకోవాలని పిలుపునిచ్చారు. డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ, వృద్ధులకు సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు ఒక వరం వంటిదని అభివర్ణించారు. జిల్లాలో ట్రిబ్యునల్ కోర్టుకు వస్తున్న కేసుల వివరాలు, కోర్టు పనిచేస్తున్న తీరును ఆమె వివరించారు. ఇకముందు కూడా సీనియర్ సిటిజన్స్ కోసం మరింతగా పనిచేయాల్సిన విషయాల గురించి చర్చించుకున్నారు. సీనియర్ సిటిజన్స్ చట్టంపై అవగాహన కార్యక్రమాలను గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు నిర్వహిస్తామని, అన్ని డిపార్ట్‌మెంట్‌లతో సమన్వయం (కన్వర్జెన్స్) చేసుకుంటూ వయోవృద్ధుల కోసం కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ నారాయణ, డాక్టర్ అనితా రెడ్డితో పాటు డాక్టర్ ఉష, వాణి, సీనియర్ సిటిజన్స్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మపాలెంలో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థిగా ఆదిలక్ష్మి



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** మండలంలోని అమ్మపాలెం గ్రామ సర్పంచ్ అభ్యర్థిత్వానికి బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థిని ప్రకటించింది. ఈసారి పార్టీ బలపరిచిన అభ్యర్థిగా భవాన్ల ఆదిలక్ష్మి ప్రభాకర్ (లాలయ్య) బరిలో నిలబడతారని గ్రామ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా, గ్రామ నాయకులైన రాందేని నాగేశ్వర రావు, శేఖర్, భావ్సింగ్, అంకతి కోటేశ్వర రావు, అంకతి హనుమయ్య, శంకర్, మాలపోల శ్రీనివాస్, యుగేందర్, నాగేశ్వర రావు, బందం రవి, సక్రం తదితరులు మంగళవారం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను కలిసి, అభ్యర్థిత్వంపై ఆయన సమ్మతిని పొందారు. మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రెండు పర్యాయాలుగా అమ్మపాలెం గ్రామంలో పార్టీ బలపరిచిన అభ్యర్థులే సర్పంచ్‌గా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. ఈసారి కూడా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, గ్రామ ప్రజలు, పార్టీ అభిమానులు కలిసికట్టుగా పనిచేసి పార్టీ బలపరిచిన అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ఆయన సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఆదిలక్ష్మి ప్రభాకర్‌ను గెలిపించేందుకు కృషి చేయాలని రెడ్యానాయక్ పిలుపునిచ్చారు.

## బాధిత కుటుంబానికి సిరికొండ మధుసూదనాచారి పరామర్శ



**వరంగల్ వాయిస్, శాయంపేట:** మండలంలోని జోగంపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఏదుల జనార్ధన్ కుటుంబ సభ్యులను మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి మంగళవారం పరామర్శించారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన జనార్ధన్ మృతదేహాన్ని సందర్శించి, వారి కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి వెంట టీఆర్ఎస్ నాయకులు మార్క సుదర్శన్, ఏదుల ఆగయ్య, బుస కొమురయ్య, లక్కం రాజు, కొండ సత్యం, లక్క మల్లయ్య, గుర్రం రవీందర్, పొడి శెట్టి గణేష్, పల్లవైన సారయ్య, గజ్జి శంకర్, తదిపాల జోగి రెడ్డి, అరికిల్ల విజయ్, మార్గ వీర ప్రతాప్, బూర విజయ్, గడల మధు, బగ్గి రమేష్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ గ్రామ శాఖ నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, శాయంపేట:** మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక ప్రక్రియ జరిగింది. సందర్భంగా, కొత్తగట్టు సింగారం గ్రామ బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ నూతన అధ్యక్షుడిగా ఆలేటి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మశాఖ నూతన కమిటీ ఎన్నికైన వెంటనే, నూతన అధ్యక్షుడు ఆలేటి శ్రీనివాస్ నాయకత్వంలో కమిటీ సభ్యులు భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీకి మాజీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షులు ఆలేటి శ్రీనివాస్‌తో పాటు మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, మాజీ ఎంపీపీ తిరుపతి రెడ్డి, సదాశివ రెడ్డి, ఆలేటి రాకేష్, కొత్తగట్టు సాయి, పెంబర్తి వినయ్, అఖిల్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# కోటేశ్వరరావు మృతి హిందూ సమాజానికి తీరని లోటు

## బీజేపీ నేత వన్నాల వెంకట రమణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** 65 సంవత్సరాల పాటు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) విస్తరణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత సేవాగణకుడు, ఆర్ఎస్ఎస్ సీనియర్ స్వయంసేవక్ శ్రీ రేవా కోటేశ్వరరావు గారి మరణం హిందూ సమాజానికి తీరని లోటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ అన్నారు. శ్రీ రేవా కోటేశ్వరరావు మరణ వార్త విని, ఆయన ఆ రోజు అందుబాటులో లేకపోవడం వలన, సోమవారం వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. వారి కుమారులు డాక్టర్ నాగానంద్,కేశవ రావుని, కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. రేవా కోటేశ్వరరావు ఎమర్జెన్సీ కాలంలో చేసిన పోరాటం, అలాగే శ్రీ రామ జన్మభూమి ఉద్యమంలో కీలక భూమిక పోషించిన విషయాన్ని ఈ సందర్భంగా డాక్టర్ వన్నాల వెంకట రమణ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా, డాక్టర్ వెంకట రమణ వారి కుమారులతో మాట్లాడి, తాను విద్యార్థిగా ఉన్నప్పుడు శ్రీ గురుకులం, మహేశ్వరంలో రేవా కోటేశ్వరరావు అధ్యాపకుడిగా ఉన్న రోజులను గుర్తుచేసుకున్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో డాక్టర్ వన్నాల వెంకట రమణ వెంట బీజేపీ సీనియర్ నాయకులు శ్రీ సముద్రాల పరమేశ్వర్, కాశీబుగ్గ మండల అధ్యక్షులు అపురూప రజనీష్ నేత, జిల్లా కోశాధికారి కూచన క్రాంతి, జిల్లా నాయకులు కోట సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# ఒంగోలు ఆర్ట్ ఫెస్ట్ కి సాగంటి మంజుల చిత్రం ఎంపిక



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండకు చెందిన ప్రముఖ చిత్రకారిణి, విద్యా కళాశాల అధ్యాపకురాలు, సాగంటి ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ మంజుల సాగంటి కుంచె నుంచి రూపుదిద్దుకున్న చిత్రం ప్రతిష్టాత్మకమైన ఒంగోలు ఆర్ట్ ఫెస్ట్-2025 (ఆర్ట్ ఎగ్జిబిషన్)కి ఎంపికైంది. ఈ ఆర్ట్ ఫెస్ట్‌ను కళాయజ్ఞ సృష్టికర్త ఏలూరి శేష బ్రహ్మం ఆధ్వర్యంలో ఈ నెల 3, 4, 5 తేదీలలో హైదరాబాద్ ఫైన్ ఆర్ట్స్ కాలేజీ కేంద్రంగా నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శన "భారత దేశ సంప్రదాయ గృహాలు" అనే ప్రత్యేక అంశంపై జరుగుతుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన దాదాపు 100 మంది ప్రముఖ ఆర్టిస్టులు ఈ ప్రదర్శనలో పాల్గొననున్నారు. తన చిత్రం ఈ ప్రదర్శనకు ఎంపిక కావడం తనకు గర్వకారణం అని డాక్టర్ మంజుల సాగంటి మీడియాకు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ ప్రదర్శనకు ప్రముఖ సినీ దర్శకులు శేఖర్ కమ్ముల ముఖ్య అతిథిగా రానున్నారని, ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ హాజరు కావచ్చని డాక్టర్ మంజుల సాగంటి ఆహ్వానించారు.

# ముస్త్యాలపల్లి సర్పంచ్ బరిలో వెంకటేష్



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు మేక మల్ల వెంకటేష్ రాబోయే సర్పంచ్ ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. ఉన్నత విద్యావంతుడైన (ఎల్.ఎల్.బీ పూర్తి చేసిన) వెంకటేష్... రొటీన్ రాజకీయాలకు వ్యతిరేకంగా, కేవలం గ్రామ అభివృద్ధిలో చురుకుగా పాలు పంచుకోవాలనే లక్ష్యంతో ఈ ఎన్నికల్లో పోటీకి సిద్ధమయ్యారు. గ్రామ ప్రజలకు సుపరిచితుడుగా, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా వెంకటేష్‌కు పేరుంది. గ్రామాభివృద్ధి, సుపరిపాలన అందించేందుకు యువత ప్రజాసేవను బాధ్యతగా భావించాలనే స్ఫూర్తితో ఆయన ముందుకు వస్తున్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను, పరిస్థితులను మార్చడం, ప్రజల కనీస అవసరాలు తీర్చడం, సమయ పాలనతో సేవ అందించడం తన లక్ష్యమన్నారు. యువత అండతో సర్పంచ్ బరిలో నిలిచి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నట్లు ఆయన తెలిపారు. తనకు అవకాశం కల్పిస్తే యువత ఆలోచనలకు అనుగుణంగా, పాత తరం రాజకీయాలకు భిన్నంగా సేవలందిస్తానని వెంకటేష్ అన్నారు.

# బయో మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభం

## ■ మడికొండ డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం



**వరంగల్ వాయిస్, రాంపూర్/మడికొండ:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 46వ డివిజన్ రాంపూర్ పరిధిలోని మున్సిపల్ డంపింగ్ యార్డు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన బయో మైనింగ్ ప్రాజెక్టును మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అధికారులతో కలిసి ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ మడికొండ డంపింగ్ యార్డు సమస్య ఎంత తీవ్రంగా ఉందో అసెంబ్లీలో సైతం తాను ప్రసంగించినట్లు గుర్తు చేశారు. హైదరాబాద్ నుండి ఓరుగల్లుకు వస్తుంటే, ముఖద్వారమైన మడికొండ వద్ద డంపింగ్ యార్డు వల్ల తరచుగా పొగ మంచు (ఫాగ్) మాత్రమే కనిపించేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు అనేకసార్లు ధర్నాలు చేసి, తమకు వినతిపత్రాలు అందజేశారని తెలిపారు. "బయో మైనింగ్ మిషన్ల ద్వారా చెత్త నియంత్రణ సాధ్యమవుతుంది. ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి కూడా డంపింగ్ యార్డు సమస్యపై మాట్లాడారు. ఈ సమస్య త్వరలోనే శాశ్వతంగా పరిష్కరించబడుతుందన్నారు. డంపింగ్ యార్డు వల్ల ఏర్పడుతున్న ఫాగ్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ సమస్య నగరానికి గుదిబండగా మారిందని ఆయన అన్నారు. వరంగల్ నగర సమగ్ర అభివృద్ధిపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరమైన ఓరుగల్లును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతోందన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం, మామునూరు ఎయిర్ పోర్ట్, స్పోర్ట్స్ స్కూల్ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఓరుగల్లులో జరుగుతున్నాయని, ప్రజలందరూ ప్రజా ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని విలీన గ్రామాల అభివృద్ధికి 1/3 నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. విలీన గ్రామాలు వేగంగా విస్తరిస్తున్నాయని, కార్పొరేషన్‌కు అధికంగా రెవెన్యూ, క్యాంపు డ్యూటీ ఈ గ్రామాల నుంచే వస్తున్నా, వాటి అభివృద్ధిపై సవతి తల్లి ప్రేమ చూపితే ఊరుకోనని హెచ్చరించారు. తుఫాన్ ప్రభావం నేపథ్యంలో నష్టపోయిన ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యటించి బాధితులకు అండగా నిలిచారని, ఇళ్లలోకి నీరు చేరిన వారికి రూ. 15 వేలు, రేషన్ అందించామని చెప్పారు. తాము నాయకులుగా కాకుండా ప్రజా సేవకులుగా నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌కు ఉన్న హైడ్రా మాదిరిగానే వరంగల్‌లో వైడ్రా తీసుకురావాలని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. వైడ్రా తీసుకువస్తే ఆక్రమణకు గురైన చెరువులు, నాళాలు తొలగిపోయి వరంగల్ నగరం సేఫ్‌గా ఉంటుందని అన్నారు. హైడ్రాపై కొంతమంది నేతలు కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అసత్య ప్రచారాలు చేసే వారి చెంప చెల్లుమనిపించాలని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్, మెట్టుగుట్ట ఆలయ చైర్మన్ పైడిపాల రఘు చందర్, మండల పార్టీ అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు వస్కుల నాగరాజు, నాయకులు, కార్యకర్తలు, మడికొండ గ్రామస్తులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ప్రొఫెసర్ తూము సులోచనకు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ తూము సులోచన ఇటీవల అనారోగ్య కారణంగా హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో మృతి చెందారు. గత శనివారం ఆమె తుది శ్వాస విడగా, సోమవారం హనుమకొండలోని పద్మాక్షి గుట్ట వద్ద అంత్యక్రియలు నిర్వహించబడ్డాయి. ప్రొఫెసర్ సులోచన స్మారకార్థం, కేయూ జువాలజీ (జంతు శాస్త్ర) విభాగంలో మంగళవారం ఉదయం 11 గంటలకు శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తూము సులోచన గారు విద్యా రంగంలో సుదీర్ఘకాలం సేవలందించారు. ఆమె పింగళి కాలేజీలో 10 సంవత్సరాలు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, ఆపై యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ జువాలజీ విభాగంలో 5 సంవత్సరాలు, తరువాత కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగంలో 1983 నుండి 2006 వరకు 23 సంవత్సరాలు ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించారు.ఆమె సేవలు, శాస్త్ర బోధనలో చూపిన నిబద్ధతను ఈ సందర్భంగా విభాగ ఆచార్యులు స్మరించుకున్నారు. శ్రద్ధాంజలి కార్యక్రమంలో జంతు శాస్త్ర విభాగ అధిపతి ప్రొఫెసర్ వై.వెంకయ్య పాల్గొన్నారు. ఆయన సులోచన గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రెండు నిమిషాలపాటు మౌనం పాటిస్తూ ఆమెకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో విభాగ ఆచార్యులు ప్రొఫెసర్ జి. సమిత, ప్రొ.మామిడాల ఇస్తారి, ప్రొఫెసర్ ఈసం నారాయణ, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. తూము సులోచన విద్యా సేవలను స్మరిస్తూ, అందరూ ఆమె కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

# పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులకు సన్మానం



**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ విభాగంలో సుదీర్ఘకాలం పాటు విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులకు మంగళవారం ఘనంగా సన్మానం నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) సన్ ప్రీత్ సింగ్ ఈ కార్యక్రమానికి హాజరై, పదవీ విరమణ చేసిన సిబ్బందిని సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ, సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖకు సేవలు అందించిన పదవీ విరమణ చేస్తున్న అధికారులు నేటి తరం పోలీసులకు ఆదర్శంగా నిలుస్తారని కొనియాడారు. పదవీ విరమణ చేసిన సిబ్బందికి సీపీ కొన్ని ముఖ్య సూచనలు చేశారు. పదవీ విరమణ అనంతరం తమ సమయాన్ని సేవా కార్యక్రమాలకు కేటాయించాలని సూచించారు. పదవీ విరమణ తర్వాత సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ప్రభుత్వం నుంచి అందే డబ్బును భవిష్యత్తు అవసరాలకు భద్రపర్చుకోవాలని సీపీ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీ సురేంద్ర, ఆర్ఐ సతీష్, స్పర్జన్ తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది, పదవీ విరమణ చేసిన సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ, జిల్లా స్థాయిలో తమ వినతులకు అధికారులు విలువ ఇవ్వడం లేదని ఆరోపిస్తూ...మంగళవారం వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో కాళోజి జంక్షన్లో "కాంగ్రెస్ ప్రభుత్వంలో వినతులకు విలువలేదు" అనే నినాదంతో ఒక పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో భాష బోయిన సంతోష్ (ఏఐఎస్ఎఫ్), హకీం నవీద్ (ఏఐఎస్‌బీ), రాచకొండ రంజిత్ (పీడీఎస్‌యూ), స్టాలిన్ (ఎస్ఎఫ్ఐ), నాయకులు జ్యోతి, యుగంధర్, నందు, పార్థు, విశాల్, విద్వాన్, సౌమ్య, అనూష తదితరులు పాల్గొన్నారు.

# టీబీ నియంత్రణకు స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరి

## ■ కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో స్క్రీనింగ్ పరీక్షలను త్వరితగతిన పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ వైద్యాధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీలు) వైద్యాధికారులు, సిబ్బందితో కలెక్టర్ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 1,98,000 ప్రభావిత గ్రూపులకు చెందిన వారికి పరీక్షలు నిర్వహించవలసి ఉండగా, ఇప్పటివరకు కేవలం 1,30,049 మందికి మాత్రమే స్క్రీనింగ్ నిర్వహించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. స్క్రీనింగ్ తక్కువగా నిర్వహించిన వడ్డేపల్లి, లష్కర్ సింగారం, కడిపికొండ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులను కలెక్టర్ ప్రశ్నించి, ఇందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ టీబీ నిర్మూలన లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రతి ఆరోగ్య కేంద్రం ఒక యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని, దానికనుగుణంగా స్క్రీనింగ్, ఎక్స్ రే, నాట్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అందించిన మొబైల్ ఎక్స్ రే మిషన్‌ను కలెక్టర్ పరిశీలించి, ప్రణాళిక ప్రకారం ఎక్కడైతే ఎక్స్ రే పరీక్షలు తక్కువగా జరిగాయో, అక్కడ ప్రజలకు అవగాహన కల్పించి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో స్క్రీనింగ్ బాగానే జరుగుతున్నప్పటికీ, పట్టణ పరిధిలో మాత్రం చాలా తక్కువగా ఉందని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంతాలలో కూడా స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించాలని సూచించారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, అందుబాటులో ఉన్న సిబ్బంది, వనరులతో టీబీ ముక్త్ భారత్, ఎన్సీడీ, మాతా శిశు సంక్షేమంతో సహా అన్ని ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. లక్ష్యాలను సాధించని వారిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఈ సందర్భంగా టీబీ ముక్త్ భారత్, గర్భిణీ స్త్రీల నమోదు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య తక్కువగా ఉన్న ఆరోగ్య కేంద్రాల ఏఎన్ఎంలు, ఆశాలవారీగా సమీక్షించి, లోపాలను అధిగమించి లక్ష్యాలను పూర్తి చేయాలని కోరారు. 100 శాతం ప్రసవాలను ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరిగేలా ప్రోత్సహించిన ఆరుగురు ఆశాలను ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్ మోహన్ రావు, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, పీఓడీటీ డాక్టర్ ప్రభుదాస్, డాక్టర్ జ్ఞానేశ్వర్, డెమో వి. అశోక్ రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు కృషి, పట్టుదలతో చదవాలి




## ■ కజాంపురం దామోదర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యార్థులు కృషి, పట్టుదలతో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని చదివితే విజయం సాధించడం తథ్యమని మోటివేషనల్ స్పీకర్, సైకాలజిస్ట్ కజాంపురం దామోదర్ అన్నారు. మంగళవారం వరంగల్ కృష్ణ కాలనీలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (హనుమకొండ) వారు విద్యార్థులకు ఏర్పాటు చేసిన "సామాజిక, సంస్కార విద్యావికాస ప్రేరణ" కార్యక్రమంలో దామోదర్ ముఖ్యవక్తగా ప్రసంగించారు. సమకాలీన సమాజంలో విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవరచుకొని, చాలెంజింగ్‌గా ఎదగాలని ఆయన సూచించారు. పేదరికం నుంచి వచ్చిన విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలనే పట్టుదలను కలిగి ఉండాలని, మనస్సు దేనివైపు మళ్లనీయకుండా చదువుపై ఏకాగ్రత పెట్టాలని సూచించారు. నీతి, నిజాయితీ, కష్టపడే స్వభావం ప్రతీ విద్యార్థికి ఉండాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరని దామోదర్ అన్నారు. కౌమార వయస్సులో తెలియక అసాంఘికమైన, అనైతికమైన మార్గాలకు మొగ్గు చూపే అవకాశం ఉన్నందున, స్వీయ నియంత్రణతో తమను తాము సన్మార్గాల వైపు మళ్లించుకోవాలని, ఉత్తమమైన ఆలోచనలతో ఉన్నత స్థితికి ఎదగాలని విద్యార్థులకు ఉద్బోధించారు. కార్యక్రమంలో తొలుత సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్ మాట్లాడుతూ 'సెలఫోన్‌కు దూరం కండి, అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలకు దగ్గర కండి' అని సూచించారు. తల్లిదండ్రులు, వయోవృద్ధులు, పెద్దల పట్ల గౌరవభావం పెంచుకోవాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శరద్రుతి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ శర్మ, హరికృష్ణ, రమణారెడ్డి, వనమాల, హేమలత, కరుణశ్రీ, మరియా, ప్రవలిక, శబానా, సంగీత, ఉమ, విజయలక్ష్మి, మంజుల, కవిత, స్వప్నతో పాటు విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ముగిసిన సీఐటీయూ జిల్లా మహాసభలు

## • అధ్యక్ష, కార్యదర్శులుగా ఉప్పలయ్య, రమేష్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) హనుమకొండ జిల్లా రెండవ మహాసభలు మంగళవారం వడ్డేపల్లిలోని పీఆర్ రెడ్డి భవనంలో విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా రాబోయే మూడు సంవత్సరాల కాలానికి గాను నూతన నాయకత్వాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. సీఐటీయూ హనుమకొండ జిల్లా నూతన కమిటీలో అధ్యక్షుడిగా టి.ఉప్పలయ్య, జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, కోశాధికారి బొట్ల చక్రపాణి, ఉపాధ్యక్షులుగా గాదె ప్రభాకర్ రెడ్డి, మెట్టు రవి, పుల్ల అశోక్, సంఘాల మొగిలి, పెండ్యాల రవి, జె.సుధాకర్, సహాయ కార్యదర్శులుగా బొల్లారపు సంపత్, కలకోట్ల జోష్ణ, సుంచు రాజేశ్వరి, డి.భాను నాయక్, ఎన్.రజిత, బి.మహేష్, ఎన్.శ్రీనివాస్ ఎంపికయ్యారు. వీరితో పాటు 28 మందిని కో–ఆప్షన్ ఆఫీస్ బేరర్స్‌గా జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని నిర్ణయిస్తూ, మహాసభలో పలు కీలక తీర్మానాలు ఆమోదించారు. త్వరితగతిన కోచ్ ఫ్యాక్టరీని పూర్తి చేసి, స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. వరంగల్–హైదరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు అనుగుణమైన చర్యలు తీసుకొని, పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలి. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి. 73 షెడ్యూల్డ్ పరిశ్రమల కనీస వేతనాల జీవోలను తక్షణమే విడుదల చేయాలి. శ్రామిక మహిళలపై వేధింపులను అరికట్టాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. అసంఘటిత రంగంలో ఉన్న హమాలీలు, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి.ఈ డిమాండ్ల సాధనకై సీఐటీయూ రాబోయే కాలంలో ఉద్యమాన్ని ఉధృతం చేయాలని మహాసభ తీర్మానించింది.






# పరకాల అయ్యప్ప క్షేత్రంలో అన్నప్రసాద వితరణ



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణంలోని శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం భక్తి పూర్వక వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ మహా సేవా కార్యక్రమానికి భక్తులు, అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పరకాల పట్టణ 9వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి దంపతులు ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని తమ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అనుబంధ కార్యక్రమాలు నిర్వహించగా, అనంతరం అయ్యప్ప మాలధారులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. పరకాల, శాయంపేట, ఆత్మకూరు, హనుమకొండ, నడికూడ మండలాల నుండి భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. అన్నప్రసాదాన్ని స్వీకరించిన భక్తులు, ఈ సేవా కార్యక్రమం నిర్వహించిన పూర్ణాచారి దంపతులను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు, కన్న స్వాములు, అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో, హరిహర క్షేత్రం భక్తజన సందోహంతో నిండిపోయి పుణ్యక్షేత్ర వాతావరణాన్ని సంతరించుకుంది.

# హోంగార్డ్స్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ రాష్ట్రంలో హోంగార్డ్స్ ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. 2016 నుంచి హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదనే అంశాన్ని ప్రస్తావించిన డాక్టర్ శేషు ఈ సంవత్సరం నుంచి డిసెంబర్ 6వ తేదీని హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. గతంలో హోంగార్డ్స్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోంగార్డ్స్‌కు ఇచ్చిన అనేక హామీలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని ఆయన గుర్తు చేశారు. కాబట్టి, ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి హోంగార్డ్స్‌కు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. సాధారణ పరిస్థితుల్లోనే కాకుండా, అత్యవసర పరిస్థితులలోనూ సాధారణ పోలీసుల మాదిరిగానే విధులు నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 14,500 మంది హోంగార్డ్స్ కోసం ప్రజావేదిక తరపున డాక్టర్ శేషు పలు డిమాండ్లను ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హెల్త్ కార్డులు (ఆరోగ్య కార్డులు) అందజేయాలి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి, హోంగార్డ్స్ వ్యవస్థలో కూడా కారుణ్య నియామకాలను చేపట్టాలన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి ఒక హోంగార్డు ఏకగ్రీవంగా సర్పంచ్‌గా గెలిచిన స్ఫూర్తితోనే, హోంగార్డ్స్ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

# డ్రంకెన్ డ్రైవ్ లో పలువురికి జరిమానా

**వరంగల్ వాయిస్, కేయూ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులపై వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.లక్ష్మీనారాయణ జరిమానా విధించారు. ఈ సందర్భంగా వరంగల్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కె.సుజాత అందించిన వివరాల ప్రకారం. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డ 25 మందికి గాను కోర్టు మొత్తం రూ.20,000 జరిమానా విధించింది. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడిన ముగ్గురు వాహనదారులకు కోర్టు మొత్తం రూ.1,300 జరిమానా విధించింది. నిబంధనలను ఉల్లంఘించే వాహనదారులపై కఠిన చర్యలు కొనసాగుతాయని ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కె.సుజాత స్పష్టం చేశారు.

## విద్యార్థులకు "టాలీప్రైమ్" పై వర్క్‌షాప్




**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం "టాలీప్రైమ్,కాన్సెప్ట్‌లు, ఫీచర్లు , ప్రాక్టికల్ వినియోగం" అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 180 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ సెమినార్ హాల్‌లో జరిగిన ఈ సెషన్‌లో టాలీప్రైమ్ ప్రాముఖ్యతను వివరించారు. టాలీప్రైమ్ ప్రపంచవ్యాప్తంగా 8 మిలియన్లకు పైగా వినియోగదారులను కలిగి ఉన్న ప్రముఖ బిజినెస్ సాఫ్ట్‌వేర్ అని, భారతదేశంలో అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్ విభాగంలో దాదాపు 80% మార్కెట్ షేర్‌ను కలిగి ఉందని వక్తలు తెలిపారు. ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులు టాలీప్రైమ్ సాఫ్ట్‌వేర్ ముఖ్యమైన అంశాలు, వినియోగ విధానాలు, ప్రాక్టికల్ అప్లికేషన్ గురించి లోతుగా అవగాహన పొందారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి తోడ్పడేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అమర వేణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ రాజేందర్ కట్ల, డీన్, కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ ప్రొఫెసర్ వరలక్ష్మి, ప్రిన్సిపల్, యూనివర్సిటీ పీజీ కాలేజ్ సుబేదారి ప్రొఫెసర్ నరసింహ చారి, డాక్టర్ ఫణీంద్ర కుమార్, డాక్టర్ ప్రగతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హన్మంతాపూర్ పాఠశాలకు మౌలిక వస్తువుల వితరణ



**వరంగల్ వాయిస్, జనగామ :** పాఠశాలలో మౌలిక వసతి సదుపాయాల కల్పనకు దాతలు అందించే సహకారం అభినందనీయమని హన్మంతాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దూడల రమేష్ అన్నారు. లయన్స్ క్లబ్ జనగామ జిల్లా చైర్మన్ లయన్ పబ్బా చంద్రశేఖర్ పాఠశాల అవసరాల కోసం సుమారు రూ.12 వేల విలువైన మైక్ సెట్, కుర్చీలు, టేబుల్, స్టేషనరీ, క్యాష్ అవార్డులను వితరణ చేశారు. ఈ వస్తువులను స్వీకరించిన ప్రధానోపాధ్యాయుడు రమేష్ మాట్లాడారు. "సంపాదించడం ముఖ్యం కాదు, అందులో ఎంతో కొంత సహాయం చేయడం అనేది ముఖ్యం" అని రమేష్ అన్నారు. లయన్ పబ్బా చంద్రశేఖర్ గారు గత 15 సంవత్సరాలుగా తాను పనిచేస్తున్న పాఠశాలకు వితరణ చేయడం తన అదృష్టమని పేర్కొన్నారు. పదిమందికి సహకరించే తపన మనిషిలో ఉంటేనే జన్మ సార్ధకత చెకూరుతుందని, అది అంతులేని తృప్తినిస్తుందని తెలిపారు. దాతలు విద్యార్థులకు చేయూతనిస్తే అది విద్యా వికాసానికి తోడ్పడి, విద్యార్థులలో క్రియేటివిటీని పెంచుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి దాతలు అందించే సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా లయన్ పబ్బా చంద్రశేఖర్‌ని పాఠశాల యాజమాన్యం, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్ కన్నా పరశురాములు, అధ్యక్షుడు కారంపూడి సత్యనారాయణ, కార్యదర్శి సురేష్, కోశాధికారి సూదగాని ప్రవీణ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ దూసరి కీర్తన, ఉపాధ్యాయులు పి. విద్యావతి, తుమ్మ ఆరోగ్యమ్మ, అంగన్వాడి టీచర్స్ మమత, సంధ్య, ఆయాలు అనిత, స్వప్న, ఐలమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చెన్నారావుపేటలో బీఆర్‌ఎస్‌కు షాక్

**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట:** మండలంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కీలక నాయకులు, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ చేరికలు మండలంలో బీఆర్ఎస్‌కు కొంతమేర ఎదురుదెబ్బగా పరిగణించవచ్చు. మంగళవారం నాడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సిద్ధన రమేష్ గారి ఆధ్వర్యంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఎల్లయ్యగూడెం మాజీ సర్పంచ్ జయజనార్ధన్, 16 చింతలు తండా మాజీ సర్పంచ్‌లు గణేష్, విక్రమ్, అమీనాబాద్ గ్రామ బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు సింగరబోయిన కుమారస్వామి, వార్డు సభ్యులు రాంసింగ్, భద్రు నాయక్, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సిద్ధన రమేష్, పార్టీలోకి ఆహ్వానించారు. వారి రాకతో మండలంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అన్యాయం జరిగిన వారికి అండగా బీఆర్ఎస్ లీగల్ సెల్

■ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ రావు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ ఉద్యమ నిర్మాత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దీక్షా దివస్ కార్యక్రమం సందర్భంగా, 4వ రోజు "తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదుల పాత్ర" అనే అంశంపై మంగళవారం హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో న్యాయవాదులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ రావు మాట్లాడుతూ, తెలంగాణకు అన్యాయం జరుగుతోందని గ్రహించి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారా ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని నాడు న్యాయవాదులు ముందుండి పోరాడారని గుర్తుచేశారు. ఉద్యమ సమయంలో న్యాయవాదులు ఉద్యమకారుల తరపున కేసులు వాదించి, తెలంగాణ ఉద్యమానికి చేదోడు వాదోడుగా నిలిచారు. కోర్టు ఆవరణలో సైతం ఉద్యమాలు నడిపిన ఘనత న్యాయవాదులకే దక్కుతుందని కొనియాడారు. స్వరాష్ట్రం సాధించిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ న్యాయవాదుల సంక్షేమానికి నిధులు, నూతన కోర్టుల ఏర్పాటు, మౌలిక వసతులు కల్పించారని తెలిపారు. న్యాయవాద వృత్తి నుంచి వచ్చిన తనలాంటి ఎందరికో కేసీఆర్ రాజకీయ అవకాశాలు సైతం ఇచ్చారని గుర్తుచేశారు. ఉద్యమ స్ఫూర్తితోనే, రానున్న మూడేళ్లు బీఆర్ఎస్‌కు అండగా న్యాయవాదులు నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా న్యాయవాదుల పోరాటం గొప్పదని, వారు పోరాట స్ఫూర్తిని రగిలించారని అన్నారు. గడిచిన రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో బీఆర్ఎస్ శ్రేణులపై నమోదవుతున్న తప్పుడు కేసులను కోర్టుల్లో వాదించి, గెలిచి కాంగ్రెస్ కుట్రలను బీఆర్ఎస్ లీగల్ సెల్ ఛేదిస్తోందని, తద్వారా ప్రజల్లో బీఆర్ఎస్‌కు ఆదరణ పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. లగచర్ల రైతులు, ఫార్మా రైతులు, ట్రిపుల్ ఆర్ బాధితులు, హైడ్రా బాధితులు... తెలంగాణలో కాంగ్రెస్ ఏ వర్గానికి అన్యాయం చేసినా, వారు బీఆర్ఎస్ పార్టీనే ఆశ్రయిస్తున్నారని, వారి తరపున పార్టీ లీగల్ సెల్ పోరాడుతోందని తెలిపారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ పార్టీని, పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న కార్యకర్తలను తప్పుడు కేసుల నుంచి కాపాడుతోందని, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్‌పై నమోదైన కేసుల్లో కోర్టుల్లో వాదనలు వినిపించి రక్షణ కల్పిస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల బీఆర్ఎస్ లీగల్ సెల్ గౌరవ అధ్యక్షులు సహోదర్ రెడ్డి, జనార్ధన్ గౌడ్, శ్యామ్ సుందర్, లీగల్ సెల్ బాధ్యులు శివ రాజ్, నాయిని రవి, శ్రీరామ్ కిరణ్, అంజయ్య గౌడ్, వసంత్ యాదవ్, వేణు పటేల్, అరుణ, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిని లాలించిన ఎస్సై

### పోలీసుల ప్రేమకు స్థానికుల హర్షం



**వరంగల్ వాయిస్, వేలేరు:** స్థానిక ఎన్నికల విధుల్లో భాగంగా వేలేరు పోలీస్ స్టేషన్ ఎస్సై సురేశ్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. సాధారణంగా కఠినంగా వ్యవహరించే పోలీసు అధికారి చూపించిన ఈ ప్రేమను చూసి అక్కడున్న స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలో నామినేషన్ ప్రక్రియ సరళిని ఎస్సై సురేశ్ పర్యవేక్షిస్తున్నారు. ఆ సమయంలో ఒక మహిళ తన చిన్నారి పాపను తీసుకుని నామినేషన్ వేయడానికి వచ్చింది. చిన్న పాపతో ఆ మహిళ ఇబ్బంది పడుతుండగా గమనించిన ఎస్సై సురేశ్, వెంటనే చొరవ తీసుకుని ఆ పాపను తన చేతుల్లోకి తీసుకున్నారు. కాసేపు ఆ చిన్నారిని లాలించి, ఆడించారు. మహిళ తన నామినేషన్ ప్రక్రియను పూర్తి చేసుకునే వరకు పాపను అల్లరి పడకుండా చూసుకున్నారు. ఎప్పుడు కఠినంగా ఉండే పోలీసులు కూడా ఈ విధంగా ప్రేమను, దయను చూపడం పట్ల అక్కడున్న స్థానికులు, ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఎస్సై సురేశ్‌ను అభినందించారు.

## సమస్యాత్మక కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు

### పరకాల ఏసీపీ సతీష్ కుమార్



**వరంగల్ వాయిస్, దామెర:** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియను గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పరకాల ఏసీపీ సతీష్ కుమార్ సూచించారు. మంగళవారం నుంచి మండలంలో నామినేషన్లు స్వీకరిస్తున్న సందర్భంగా, ఏసీపీ సతీష్ కుమార్ మండలంలోని ఊరుగొండ, దామెర మొదలైన సమస్యాత్మక నామినేషన్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన ఎంపీడీఓ గుమ్మడి కల్పనను కలిసి నామినేషన్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మౌలిక వసతుల కల్పనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏసీపీ మాట్లాడుతూ, సమస్యాత్మక నామినేషన్ పోలింగ్ కేంద్రాలలో పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని ఆయన దామెర ఎస్సైకి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కొంక అశోక్, మండల విద్యాశాఖ అధికారి ఎల్. రాజేష్ కుమార్, ఎంపీవో రంగా చారి తదితరులు పాల్గొన్నారు.


# సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలి

◆ వరంగల్ క్రైమ్ ఏసీపీ సదయ్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేటి కాలంలో నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో, నేరాల అదుపులో అందరూ భాగస్వాములు కావాలని, తమవంతు బాధ్యతలను నిర్వర్తించాలని వరంగల్ క్రైమ్ ఏసీపీ సదయ్య కోరారు. జాగ్రత్తతో మెలగడం వల్ల మహిళలపై జరిగే నేరాలను అదుపు చేయవచ్చని ఆయన స్పష్టం చేశారు. హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో దాదాపు 200 మంది విద్యార్థినులతో క్రైమ్ ఏసీపీ సదయ్య నేడు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థినులు సైబర్ నేరాలు, మహిళలపై జరిగే అత్యాచారాలు, అఘాయిత్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఏసీపీ సదయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక సూచనలు చేశారు. అమ్మాయిలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, టెలిగ్రామ్ లాంటి సోషల్ మీడియా వేదికలలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలి. ఒంటరిగా మహిళలు తెలియని ప్రదేశాలకు ప్రయాణం చేయవలసి వచ్చినప్పుడు, అందరూ తప్పనిసరిగా టీ–సేఫ్ యాప్‌ను ఉపయోగించుకోవాలని, దానిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఉద్యోగాలు చేసే మహిళలు తాము పనిచేసే ప్రదేశాలలో అసభ్యకరంగా ప్రవర్తించే వారి పట్ల, ఆకతాయిల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వారితో తమ వ్యక్తిగత విషయాలు పంచుకోరాదని సూచించారు. ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా వెంటనే షీ టీమ్ పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని ఏసీపీ అన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ 1930 కి ఫిర్యాదు చేయాలని సూచించారు. తమ షీ టీమ్ మొబైల్ నంబర్స్, సీపీ వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270 కు ఫిర్యాదు చేసిన వారి వివరాలను చాలా గోప్యంగా ఉంచుతామని, నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి, వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, షీ టీమ్ సీఐ సుజాత గారు, హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ, ఉమెన్ కానిస్టేబుల్ పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# దానికోసం ఇంత దిగజారుడా



### ఇదేం జర్నలిజం అంటూ వాపోయిన జాన్వీ

సెలబ్రిటీలు మరణించినప్పుడు మీడియా వ్యవహరిస్తోన్న తీరుపై నటి జాన్వీకపూర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తన తల్లి శ్రీదేవి మరణించినప్పుడు అందరూ తనను టార్గెట్ చేశారని బాధ పడ్డారు. కొందరు తన మాటలను మీమ్స్‌గా కూడా ఉపయోగించుకున్నారని అవి చూసినప్పుడు కలిగిన బాధ మాటల్లో వర్ణించలేనని అన్నారు. తాజాగా లెజెండరీ నటుడు ధర్మేంద్ర మృతి చెందినప్పుడు కూడా మీడియా అత్యుత్సాహం చూపించిందని అది నిజమైన జర్నలిజం కాదని జాన్వీ అసహనం వ్యక్తంచేశారు.తన తల్లి మరణించినప్పుడు టీవీ చూడడానికి కూడా భయం వేసిందని జాన్వీ అన్నారు. అమ్మ మరణంపై ఎన్నో అవాస్తవాలు రాశారు. ఒక కూతురుగా ఎంతో గందరగోళానికి గురయ్యాను. ఎప్పటికీ కోలుకోలేనేనని భయపడ్డా. ఆ తర్వాత అన్నీ అర్థం చేసుకొని నా పనిపై దృష్టిపెట్టాను అని జాన్వీ చెప్పారు. తాను ఇండస్ట్రీలోకి రావడానికి కొన్ని నెలల ముందే మా అమ్మ ఈ లోకాన్ని విడిచిపెట్టింది. నా తొలి చిత్రం ప్రచారంలో నేను మా అమ్మను గుర్తుచేసుకుంటూ చెప్పిన మాటలపై కొందరు మీమ్స్ చేశారు. నన్ను టార్గెట్ చేసి మాట్లాడేవారు. అవి చూసి కొన్ని రోజులు అన్నిటికీ దూరంగా ఉన్నాను. ఆ కాలాన్ని నేను ఇప్పటికీ మర్చిపోలేను. ఆ సమయంలో నేను ఏది చెప్పినా అది అందరికీ తప్పుగానే అనిపించేది. తల్లి మరణంపై కుమార్తె బాధ పడితే దాన్ని కూడా అపహాస్యం చేస్తారని ఎవరైనా ఊహించగలరా. ధర్మేంద్ర విషయంలో కొందరు మరింత దిగజారి ప్రవర్తించారు. సెలబ్రిటీల విషయంలో ఇలా జరగడం ఇదే తొలిసారి కాదు.. వ్యూస్, లైక్స్ కోసం ఇష్టం వచ్చింది రాస్తున్నారు.




# అక్కడ ఆర్భాటం తప్పనిసరి

### మళయాల నటుడు దుల్కర్ సల్మాన్

హిందీ, మలయాళ చిత్ర పరిశ్రమల మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని నటుడు దుల్కర్ సల్మాన్ అన్నారు. హిందీలో ప్రవేశించాలంటే హంగూ..ఆర్భాటంఅవసరం అన్నారు. లేదంటే మనలను కనీసం చూడకూడా చూడరని వ్యాఖ్యానించారు. భాషతో సంబంధం లేకుండా వరుస సినిమాలతో అలరిస్తున్న దుల్కర్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్‌లో పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. హిందీ సినిమాలో నటించేటప్పుడు పెద్ద స్టార్ అని అనిపించుకోకపోతే వాళ్లు ఎంతో నిర్లక్ష్యం చేస్తారని అన్నారు. తాను బాలీవుడ్‌లో నటించేటప్పుడు నా చుట్టూ ఎప్పుడూ ఇద్దరు వ్యక్తులు ఉండేవారు. నేను స్టార్ అని అందరినీ నమ్మించాల్సి వచ్చింది. లేకపోతే నాకు కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా ఉండదు. మోనిటర్ చూడడానికి స్థలం కూడా ఇవ్వరు. మన చుట్టూ జనాలు ఉంటేనే వాళ్లు మనల్ని గుర్తిస్తారు. లగ్జరీ కారులో వస్తేనే మనల్ని స్టార్ అనుకుంటారు. అలాంటి భావన దురదృష్టకరం. మలయాళ సినిమా సెట్‌లో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఎక్కువ ఖర్చు ఉండదు. ఇంటినుంచి అన్నీ తెచ్చుకుంటాం. ఎక్కువగా సొంత ఖర్చులే పెట్టుకుంటాం అని దుల్కర్ అన్నారు. 2018లో దుల్కర్ కార్వాన్ చిత్రంతో హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఇటీవలే 'కాంత'తో ప్రేక్షకులను పలకరించారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం డిసెంబర్ 12 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# యానిమల్ ఛాన్స్ వచ్చివుంటే తిరస్కరించే దాన్ని: రసిక దుగల్

బాలీవుడ్ నటి రసిక దుగల్ మరోసారి తన సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచింది. పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే సినిమాలను తాను ఎప్పటికీ అంగీకరించబోనని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా బాలీవుడ్‌లో భారీ విజయం సాధించిన 'యానిమల్' వంటి సినిమా ఆఫర్ తనకు వస్తే తాను 'నో' చెప్పేదానినని తెలిపింది. 'మీర్జాపూర్', 'ఢిల్లీక్రైమ్' వంటి పాపులర్ వెబ్ సిరీస్‌లతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రసిక దుగల్.. సినిమాలను ఎంచుకునే విషయంలో తన విధానాన్ని తాజాగా ఒక ఇంటర్వ్యూలో పంచుకుంది. నేను ఎంచుకునే ప్రతి సినిమా యొక్క రాజకీయాలు నాకు చాలా ముఖ్యం. కేవలం పైపైన చూడడం కాకుండా, అది నా నిర్ణయాలకు మూలస్తంభంగా నిలుస్తుంది. ఒకవేళ నాకు 'యానిమల్' వంటి సినిమాలో అవకాశం వచ్చి ఉంటే దానికి నేను ఖచ్చితంగా 'నో' చెప్పేదాన్ని. ఎందుకంటే పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే ప్రాజెక్ట్‌ను నేను ఒకరోజు అంగీకరిస్తానేమోననేదే నా అతిపెద్ద భయం అని రసిక దుగల్ అన్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.



# అడల్ట్ కామెడీతో సైక్ సిద్ధార్థ



టాలీవుడ్ యువ నటుడు నందు, యామిని భాస్కర్ జంటగా నటిస్తున్న సినిమా 'సైక్ సిద్ధార్థ'. మీలాంటి యువకుడి కథ అనేది ఉపశీర్షిక. అడల్ట్ కామెడీతో తెరకెక్కుతున్న ఈ మూవీకి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రి, మౌనిక తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నిర్మాత శ్యామ్ సుందర్ రెడ్డితో పాటు నందు కూడా ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నారు. ఈ చిత్రం డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే అడల్ట్ కామెడీగా ఈ చిత్రం రాబోతుందని తెలుస్తుంది. ఎక్కువగా బూతులతోనే ట్రైలర్‌ను నింపేశారు.



# బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

- **42 శాతం ప్రకటించి 17 శాతానికే పరిమితం**
- **బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**

(మొదటి పేజీ తరువాయి..) ఈ కార్యక్రమానికి గంట రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకత్వం సర్పంచ్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పార్టీని బలోపేతం చేయడానికి, ముఖ్యంగా వరంగల్ జిల్లాలో మెజారిటీ పంచాయతీలను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందని గంట రవికుమార్ పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కేంద్ర నిధులతోనే సాధ్యమని, అందుకే వరంగల్ జిల్లా బీజేపీ సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. గ్రామ వార్డు మెంబర్ స్థాయి నుంచి జడ్పీటీసీ వరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేయాలని, కేంద్ర ప్రభుత్వం అందించే నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతోందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చాలినన్ని నిధులు ఇస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిధులను సక్రమంగా వినియోగించడం లేదన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. స్థానిక ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని నేతలకు సూచించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు ప్రధాన హామీలను (మహాలక్ష్మి, రైతు భరోసా వంటివి) అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని గంట రవికుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ మాదిరిగానే అవినీతికి పాల్పడుతోందని, పారదర్శకత లేదని రవికుమార్ విమర్శించారు. ప్రభుత్వంలో మంత్రుల మధ్య, నాయకుల మధ్య తీవ్రమైన అంతర్గత విభేదాలు ఉన్నాయని, ఇది పాలనపై ప్రభావం చూపుతోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని, వీటిపై ప్రత్యక్ష పోరాటాలకు సన్నద్ధమవుతున్నామని బీజేపీ సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులకు, నాయకులకు, కార్యకర్తలకు జిల్లా అధ్యక్షులు నిర్దేశించారు. మొత్తంగా తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకదానితో ఒకటి కుమ్మక్కై తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని రవికుమార్ ఆరోపిస్తోంది. ఈ రెండు పార్టీల మోసాల వల్లే ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీని ఆదరిస్తున్నారని అన్నారు. ఈ నామినేషన్లలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, పార్లమెంట్ కన్వీనర్ తాళ్ళపెల్లి కుమారస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, గడల కుమార్, రేసు శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు బన్న ప్రభాకర్, జిల్లా కార్యదర్శి జడ సతీష్, రాధాకృష్ణ, అధికార ప్రతినిధి మహేందర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నరసింహ రాములు, హసన్ పర్తి మండల అధ్యక్షులు మారం తిరుపతి, తడక వినయ్, గూడూరు సందీప్, టి.అంబేద్కర్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు కేంద్రం మరింత మద్దతు అందించాలి

- **ఎంపీ డాక్టర్ కడియం కావ్య**
- **లోక్ సభలో సమాధానం చెప్పిన మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న వ్యవసాయ సంబంధిత పథకాల పురోగతి, లబ్ధిదారుల వివరాలు, కేంద్ర నిధుల వినియోగంపై స్పష్టమైన సమాచారం ఇవ్వాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. రైతుల సమస్యలను తాను పార్లమెంట్ వేదికగా నిరంతరం ప్రస్తావిస్తానని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. 2025–26 ఖరీఫ్ సీజన్‌కు కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలో సాధారణ వరి రూ.2,369, మధ్యస్థరకం పత్తి రూ.7,710 క్వింటాల్‌కు నిర్ణయించినట్లు తెలిపారు. 2024–25లో వరంగల్ జిల్లాలో 2.95 లక్షల బేళ్ల పత్తి, 15.56 లక్షల టన్నుల వరి సేకరణ జరిగిందని, కేంద్రం రైతులకు నేరుగా ఆదాయ భద్రత కల్పించిందని పేర్కొన్నారు.

**నీటిపారుదల పురోగతి..**

'పర్ డ్రాప్ మోర్ క్రాప్' పథకంతో దేశవ్యాప్తంగా 106.75 లక్షల హెక్టార్లలో సూక్ష్మ నీటిపారుదల అమలు చేయబడిందని, చిన్న రైతులకు 55శాతం వరకు సబ్సిడీ అందుతోందని తెలిపారు. ఏఐబీపీ కింద 2016 తర్వాత 70 ప్రాజెక్టులు పూర్తికాగా, 29.22 లక్షల హెక్టార్ల సాగు సామర్థ్యం పెరిగిందని మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. హర్ ఖేత్ కో పాని ద్వారా 22.21 లక్షల హెక్టార్లలో కమాండ్ ఏరియా అభివృద్ధి జరిగిందన్నారు.

**భారీ బీమా క్లెయిమ్స్..**

2024–25 సంవత్సరంలో ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్ బిఎఫ్) ద్వారా రూ.12,256 కోట్ల పరిహారం రైతులకు అందించినట్లు, 622 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమి బీమా కవరేజిలో ఉండగా 1,514 లక్షల మంది రైతులు లబ్ధిపొందినట్లు మంత్రి ప్రస్తావించారు. పరంపరాగత్ కృషి వికాస్ యోజన కింద ఇప్పటివరకు 16.90 లక్షల హెక్టార్లలో సేంద్రీయ సాగు ప్రోత్సహించబడిందని, 28.24 లక్షల మంది రైతులు ప్రయోజనం పొందుతున్నారని, మూడు సంవత్సరాలకు హెక్టారుకు రూ.31,500 సహాయం ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. అయితే వరంగల్ ప్రాంతానికి అనుగుణంగా రైతులకు అందించే పథకాల అమలు మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. రైతుల కోసం నా పోరాటం కొనసాగుతుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

## రక్తదానం చేయండి.. పలువురి ప్రాణాలు కాపాడండి

☐ **వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ**




**వరంగల్ వాయిస్, లీగల్ సెల్ :** రక్త దానంతో పలువురి ప్రాణాలను కాపాడవచ్చని వరంగల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ అన్నారు. తలసేమియా, హిమోఫీలియా లాంటి రోగులకు రక్త దానం ఎంతో మేలు చేస్తుందన్నారు. రక్త దానం చేయండి పలువురి ప్రాణాలు కాపాడండని న్యాయవాదులకు నిర్మలా గీతాంబ పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ కోర్టు ప్రాంగణం డీఎల్ఎస్ సేవా సదన్ లో వరంగల్ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్, వరంగల్ డిస్ట్రిక్ట్ బార్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు నిర్మల గీతాంబ, పట్టాభి రామారావు న్యాయమూర్తులు ప్రసంగిస్తూ రక్తదానంతో ఎంతోమంది ప్రాణాలు నిలుస్తాయన్నారు. రక్తదాన ఆవశ్యకత గురించి ప్రచారం చేసి కోర్టు ఆవరణలో వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలుస సుధీర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. రక్తదాన శిబిరం ఒక సేవా కార్యక్రమమే కాకుండా, మానవతకి ప్రతీకని న్యాయవాదులు న్యాయం కోసం పోరాడడంతో పాటు సామాజిక బాధ్యతతో రక్తదానం చేయడం సమాజానికి మంచి సందేశం ఇస్తుందని అన్నారు. వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలుస సుధీర్ ప్రసంగిస్తూ రక్తం కొరత తీవ్రంగా పెరుగుతున్న తరుణంలో థలసీమియా పిల్లలు, అత్యవసర శస్త్రచికిత్సలు, క్యాన్సర్, ప్రమాద బాధితులు ప్రాణాలు చేతిలో పెట్టుకొని రక్తానికై ఎదురు చూస్తున్నారని, మన దేహం నుంచి వెలువడే ఒక యూనిట్ రక్తం మూడు ప్రాణాలకు వెలుగునిస్తుందని రక్తం ఇవ్వండం ప్రాణాన్ని నిలబెట్టడం మనిషితనమని, మానవత్వానికి ప్రతీకని అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి సాయి కుమార్, న్యాయమూర్తులు క్షమా దేశ్ పాండే, రామలింగం, నారాయణ బాబు, ఉషా క్రాంతి, పూజ, నందికొండ రితిక, హారిక, వెంకట చంద్ర ప్రసన్న, వరంగల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మైదం జయపాల్, ప్రధాన కార్యదర్శి డి.రమాకాంత్, సంయుక్త కార్యదర్శి మునిపట్ల శ్రీధర్, మహిళా సంయుక్త కార్యదర్శి రేవూరి శశిరేఖ, హనుమకొండ బార్ మహిళా సంయుక్త కార్యదర్శి, కోశాధికారి సిరిమల్ల అరుణ, వరంగల్, హనుమకొండ గ్రంథాలయ కార్యదర్శులు గుండ కిషోర్, వెంకట్, సీనియర్ ఈసీ మెంబర్ ఇజ్జగిరి సురేష్, మహిళా సీనియర్ ఈసీ కళకోట్ల నిర్మల జ్యోతి, ఈసీ సభ్యులు మర్రి రాజు, జాటోతు రవి, తోట అరుణ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ శాఖ పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె.కిషన్ రావు, బ్లడ్ డోనర్ మోటివేటర్ గంధసిరి శ్రీనివాస్, మడిపల్లి ఆనంద్ గౌడ్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేసారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన 60 మంది న్యాయవాదులకు ప్రతి సభ్యుడికి పండ్లు పంపిణీ చేసి సర్టిఫికేట్లు ఇచ్చి అభినందనలు తెలిపారు. రక్తంతో ప్రాణాలను కాపాడే ఈ సేవలో పాల్గొన్న అందరికీ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.



## అయ్యప్పస్వాములకు నిత్యాన్నదానం

☐ **రంగశాయిపేట రామాలయంలో 41 రోజుల పాటు ఏర్పాటు**

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** రంగశాయిపేట శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో అయ్యప్ప మాలధారులకు మంగళవారం నుంచి నిత్యం మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మహా అన్నదాన కార్యక్రమం అడుప వేణు గురుస్వామి ఆధ్వర్యంలో 41 రోజులపాటు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆలయానికి సంబంధించిన కార్యాలయం, వంటశాల బాధ్యతలను ఆలయ కమిటీ సభ్యులు వేణు గురుస్వామికి అందజేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ప్రతిరోజు వందమంది అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేయనున్నట్లు ప్రకటించారు. అన్నదానానికి వచ్చే అయ్యప్ప స్వాములు ప్రతి రోజు ఉదయం 8 గంటలకు ఆలయానికి వచ్చి టోకెన్ తీసుకోవాలని సూచించారు. తద్వారా 100కు పైగా వచ్చే స్వాములకు కూడా భిక్ష ఏర్పాటు చేసే వీలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కేడల జనార్ధన్, కొల్లూరి యోగానంద్, వలపదాసు కృష్ణ, ఆలయ అర్చకులు శ్రీధరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com